క్లుప్తంగా

9న ప్రమాణ స్వీకారం



మంత్రిని సన్మానించిన సుధాకర్‌రెడ్డి

మునిపల్లి(అందోల్): ఈ నెల 9న రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మంతూర్ సుధాకర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు మాజీ ఎంపీపీ రాంరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ్మను కలిసి, శాలువా కప్పి సన్మానించి, ప్రమాణ స్వీకారానికి రావాలని ఆహ్వాన పత్రికను మాజీ ఎంపీపీ రాంరెడ్డి, సుధాకర్‌రెడ్డి అందజేశారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్ ఉన్నారు.

బతుకమ్మ ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్, వైస్ చైర్మన్ తదితరులు

నారాయణఖేడ్: పట్టణంలో బతుకమ్మ ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్ శనివారం పరిశీలించారు. ప్రతీ సంవత్సరం 7వ వార్డులోని బతుకమ్మ కుంట వద్ద ఉత్సవాలను నిర్వహిస్తున్నందున, మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. బతుకమ్మ ఆడేందుకు గ్రౌండ్‌ చదును చేయడంతో పాటు, నిమజ్జనానికి సంబంధించిన ప్రాంతాలను పరిశీలించారు. మాజీ సర్పంచ్ అప్పారావు షెట్కార్, మున్సిపల్ కౌన్సిలర్లు వివేకానంద్, మజీద్, రామకృష్ణ, హన్మాండ్లు, సద్దాం ఉన్నారు.

మళ్లీ నిర్మిస్తే కఠిన చర్యలు



కట్టడాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: కూల్చివేసిన అక్రమ కట్టడాలను తిరిగి నిర్మిస్తే కఠిన చర్యలు తప్పవని ఇంద్రేశం గ్రామ పంచాయతీ కార్యదర్శి సుభాష్ హెచ్చరించారు. శనివారం పటాన్‌చెరు మండలం, ఇంద్రేశం గ్రామపంచాయతీ నుంచి తీసుకున్న అనుమతులకు మించి భవనాలు నిర్మిస్తుండటంతో నోటీసులు జారీ చేశారు. అయినా వినకుండా పనులు చేస్తుడంటంతో కూల్చివేస్తున్నట్లు కార్యదర్శి సుభాష్ తెలిపారు. పంచాయతీ నుంచి తీసుకున్న అనుమతులు మేరకే నిర్మాణాలు చేపట్టాలన్నారు.

ధ్యానంతో జ్ఞానం



ప్రవచనాలు బోధిస్తున్న సంజీవ్‌మహరాజ్

మునిపల్లి(అందోల్): ధ్యానంతో జ్ఞానం పెంపొందుతుందని ఆత్మవిద్య ఉపాసకులు(మరాడ) సంజీవ్ మహరాజ్ భక్తులకు ఉపదేశించారు. శనివారం మండలంలోని కంకోల్, మగ్దుంపల్లి గ్రామం భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో భక్తులకు నవరాత్రోత్సవాల్లో భాగంగా ప్రవచనాలు బోధించారు. మనకిష్టమైన భగవన్నామస్మరణ, ధ్యానం చేస్తే ఆరోగ్యం, మనస్సు ప్రశాంతత లభిస్తుందన్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచి భగవన్నామస్మరణ అలవాటు చేయించడం వల్ల ఆధ్యాత్మిక మార్గం అలవాటు అవుతుందన్నారు. కార్యక్రమంలో విజయ నాగలింగేశ్వర స్వామి, భక్తులు వీరన్న, పరమేశ్వర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

మున్సిపల్ చైర్ పర్సన్ రోజా

పటాన్ చెరు: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజా బాల్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీలోని 1వ వార్డు, గాంధీనగర్ 2వ వార్డు, బీసీ కాలనీలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ సాధారణ నిధులు రూ.50 లక్షల చొప్పున కేటాయించి అభివృద్ధి పనులను చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చంద్రారెడ్డి, గోపాలమ్మ, చంద్రయ్య, ఏఈ కిష్టయ్య, స్థానికులు గౌస్, శీను, డాక్టర్ సాబ్ నందు పాల్గొన్నారు.



రాయికోడ్: గాయత్రీదేవి రూపంలో అమ్మవారు



మునిపల్లి(అందోల్): బుదేరాలో..



న్యాల్‌కల్(జహీరాబాద్): పంచవటి క్షేత్రంలో..



జోగిపేట: అన్నపూర్ణ దేవి అవతారంలో..

జగన్మాతా.. పాహిమాం..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో వైభవంగా కొనసాగుతున్నాయి. ఆయా మండపాల్లో కొలువుదీరిన అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. శనివారం అమ్మవారు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ దేవాలయాల్లో భక్తులు భజనలు, దాండియా తదితర కార్యక్రమాలతో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. –సాక్షి నెట్‌వర్క్



సదాశివపేట : బంగారు మైసమ్మ మందిరంలో..



పటాన్‌చెరు టౌన్: 108 రకాల నైవేద్యాలు



జహీరాబాద్ టౌన్: సిద్దేశ్వర ఆలయంలో..



పటాన్‌చెరు టౌన్: గాయత్రీదేవి అలంకరణలో..



సంగారెడ్డి టౌన్ : గాయత్రిరూపంలో వాసవీమాత



నారాయణఖేడ్ అన్నపూర్ణదేవిగా నల్లపోచమ్మతల్లి

చెరువు, కుంటల పరిశీలన



కుంటలను పరిశీలిస్తున్న అధికారులు

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని ముచర్ల, బోర్పట్ల గ్రామ శివారులోని చెరువులు, కుంటలను నీటి పారుదల, రెవెన్యూశాఖ అధికారులు శనివారం పరిశీలించారు. శివారులో ఆక్రమణకు గురైనట్లు ఇటీవల స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. నీటిపారుదల శాఖ డీఈఈ రవికుమార్, ఏఈ భూపుత్ర, హత్నూర తహసీల్దార్ షేక్ ఫర్హీంలు శివారులోని నాగటి చెరువు, కంసాని కుంట, న్యారటివాణికుంట, వన్నప్ప కుంటలను పరిశీలించారు. అలాగే, బోర్పట్ల పల్పనూర్ ఎత్తిపోతల పథకం పైపులైన్‌ను పరిశీలించారు. చెరువు, కుంటలను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నివేదికను జిల్లా అధికారులకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ అమరులకు నివాళి



నివాళులర్పిస్తున్న ఆర్టీసీ జేఏసీ నాయకులు

జహీరాబాద్ టౌన్: డిమాండ్ల సాధనకు అమరులైన ఆర్టీసీ ఉద్యోగులకు శనివారం టీజీఎస్ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు నివాళులర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకుడు మాణిక్ మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల ఆత్మబలిదానాలు ఎప్పటికీ మరువలేవమన్నారు. తమ డిమాండ్ల పరిష్కారమే అమరులకు నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు జీవన్, నరేష్, శశికుమార్ ఉన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

● ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం రామచంద్రాపురంలోని తహసీల్దార్ కార్యాలయంలో 49మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల కుటుంబంలోని ఆడపిల్లల పెళ్లి భారం కాకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం తన వంతు బాధ్యతగా ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని కోరారు. నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి, కార్పొరేటర్లు పుష్పనగేష్, సింధు ఆదర్శ్‌రెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్లు రవీందర్ రెడ్డి, శంషాబాద్ రాజు, ఆర్ఐ శ్రీకాంత్, తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

పటాన్‌చెరు టౌన్: పటాన్ చెరు డివిజన్ పరిధిలోని మహంకాళి దేవస్థానంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే, కార్పొరేటర్‌ను ఘనంగా సత్కరించి, అమ్మవారి జ్ఞాపికను అందజేశారు.

పోరాటయోధుడు పండగ సాయన్న

● కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్



సాయన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న మధు

పటాన్‌చెరు టౌన్: నిజాం రజాకర్ల, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి పేదల కడుపు నింపిన పోరాటయోధుడు పండగ సాయన్న అని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. శనివారం చేవెళ్ల పట్టణంలో పండుగ సాయన్న విగ్రహ ప్రథమ వార్షికోత్సవంలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. పేదల ఆకలితో అలమటించకూడదని భూస్వాముల నుంచి ఆహార ధాన్యాలు దోచి, పేదల కడుపు నింపిన మహనీయుడని కొనియాడారు. ఆకలితో అల్లాడుతున్న గ్రామాల్లో పండగ సాయన్న అడుగుపెడితే వారి కడుపు నింపి, పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చిన ఘనత వల్లే సాయన్నకు పండగ సాయన్న పేరు వచ్చిందన్నారు. సాయన్న స్ఫూర్తితో భవిష్యత్తు తరాలు పోరాటాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లింగం, యాదయ్య, శ్రీనివాస్, మహేందర్, శ్రీరాములు, యాదయ్య, శివరాజ్, గణేష్, వెంకటేశ్, రాము, మైసయ్య, జనార్దన్, వెంకటయ్య పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి నిధులను మంజూరు చేయాలని జలమండలి అధికారి అశోక్‌రెడ్డిని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ శనివారం కలిశారు. డివిజన్ పరిధిలోని శాంతినగర్, సీతారామపురం, జె.పి కాలనీ, చైతన్యనగర్ కాలనీ, బండ్లగూడలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. డ్రైనేజీ సమస్య పరిష్కారానికి సుమారు రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరినట్లు కార్పొరేటర్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండు నెలల క్రితం నిధులు కావాలని అడిగితే నిధులు లేవని, 2 నెలల తర్వాత కలవమని చెప్పినట్లు గుర్తు చేశారు. అయితే, ప్రస్తుతం కూడా అంతనిధులు లేవని, సమస్యాత్మకంగా ఉన్న ఒకటి, రెండు సమస్యలను పరిష్కరించేలా ప్రణాళికా వ్యయం సిద్ధం చేస్తే త్వరలో కొంత నిధులు మంజూరు చేస్తామని జలమండలి అధికారి తెలిపినట్లు వివరించారు. నిధులు లేవని అభివృద్ధి పనులను గాలికి వదిలేస్తే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు.



అధికారితో మాట్లాడుతున్న కుమార్‌యాదవ్

ఖాసీంపూర్‌లో డీఎల్‌పీఓ పర్యటన

జహీరాబాద్ టౌన్: మండలంలోని ఖాసీంపూర్ గ్రామాన్ని శనివారం డీఎల్‌పీఓ వసంత మాధురి సందర్శించారు. పంచాయతీ కార్యదర్శి దినేష్‌పై గ్రామానికి చెందిన కొంతమంది గత నెల 23న ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి గ్రామానికి సక్రమంగా రావడం లేదని, పబ్లిక్ కుళాయిలకు కొంతమంది మోటారు బిగించిన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, దీంతో తాగునీటి సమస్య నెలకొందని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎల్‌పీఓ గ్రామాన్ని సందర్శించి, విచారణ చేపట్టారు. గ్రామంలో కలియతిరిగి నీటి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను జిల్లా అధికారికి నివేదిక ఇస్తానని ఆమె పేర్కొన్నారు.



గ్రామంలో పర్యటిస్తున్న వసంత మాధురి

ముగిసిన ధ్రువపత్రాల పరిశీలన

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఐదు రోజులుగా కొనసాగుతున్న డీఎస్సీ 2024 మెరిట్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శనివారం ముగిసినట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధ్రువపత్రాల పరిశీలనలో భాగంగా శనివారం ఎస్‌జీటీలో 765 మందికి 712 మంది, లాంగ్వేజి పండిట్ విభాగంలో 43 మందికి 41 మంది అభ్యర్థులు, పీఈటీ విభాగంలో 15 మందికి 15 మంది, స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 240 మందికి గానూ 223 మంది అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారని తెలిపారు. ఎస్‌జీటీ, లాంగ్వేజ్ పండిట్, పీఈటీ విభాగంలో 58 మంది అభ్యర్థులు, స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 17 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని చెప్పారు.

అందుబాటులో శనగ విత్తనాలు

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని గ్రోమోర్ కేంద్రంలో వంద క్వింటాళ్ల శనగ విత్తనాల అమ్మకానికి సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి సారిక పేర్కొన్నారు. 25 కిలోల జేజీ రకం శనగ విత్తనాల ధర రూ.2,250లకు అందించనున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు పట్టా పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో గ్రోమోర్ కేంద్రంలో సంప్రదించాలన్నారు. విత్తనాలపై ఎలాంటి సబ్సిడీ లేదని వివరించారు.

పటాన్ చెరులో...

పటాన్ చెరు: గుమ్మడిదల మండలంలో శనగ, కుసుమ విత్తనాలు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనగ 25 కేజీల బ్యాగు రూ.2250, కుసుమ 4 కేజీల బ్యాగు రూ.345లకు విక్రయిస్తున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న ఓపెన్ పరీక్షలు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఓపెన్ స్కూల్ విధానంలో జరుగుతున్న పది, ఇంటర్మీడియట్ పరీక్షలు మూడవ రోజూ ప్రశాంతంగా జరిగాయి. శనివారం ఉదయం జరిగిన ఇంటర్మీడియెట్ పొలిటికల్ సైన్స్ పరీక్షకు 339 మందికి 271మంది హాజరు కాగా, 68 మంది గైర్హాజర య్యారు. పదవ తరగతి మ్యాథ్స్ పరీక్షకు 145 మందికి 114 మంది హాజరు కాగా, 31 మంది గైర్హాజరయ్యారు. అలాగే, మధ్యాహ్నం జరిగిన ఇంటర్మీడియెట్ కెమిస్ట్రీ పరీక్షకు 38 మంది అభ్యాసకులకు 32 మంది హాజరు కాగా ఆరుగురు గైర్హాజరయ్యారు. పదవ తరగతి బిజినెస్ స్టడీస్ పరీక్షకు 12 మందికి 10 మంది హాజరు కాగా, ఇద్దరు గైర్హాజరయ్యారని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

విద్యార్థినికి సన్మానం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గాంధీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించిన మండలంలోని వెల్టూర్ గ్రామానికి చెందిన ఈశ్వర్ కుమార్తె సౌమ్యను గ్రామపెద్దలు శనివారం శాలువాతో ఘనంగా సత్కరించి, అభినందించారు. సౌమ్య అత్యుత్తమ వైద్య విద్య సీటును సాధించడం గ్రామానికి ఎంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్ రెడ్డి, నాయకులు సతీష్‌గౌడ్, శేఖర్‌గౌడ్, ఫయాజ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

● హైకోర్టు న్యాయమూర్తి రాధారాణి

సంగారెడ్డి టౌన్ : న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి రాధారాణి అన్నారు. శనివారం సంగారెడ్డిలోని జిల్లా కోర్టును ఆమె సందర్శించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని, కలెక్టర్ వల్లూరి క్రాంతి ఘనంగా స్వాగతం పలికారు. పోలీసులు గౌరవ వందనంతో స్వాగతం పలికారు. కోర్టు సమావేశం అనంతరం గ్రంథాలయాన్ని పరిశీలించి, న్యాయవాదులతో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

తప్పులు లేకుండా నమోదు చేయాలి



సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

జహీరాబాద్ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేలో తప్పులు లేకుండా కుటుంబం వివరాలు నమోదు చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ హెల్త్ ప్రొఫైల్ కోసం ఫ్యామిలీ డిజిటల్ యూనిక్ కార్డులను జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. శనివారం పట్టణంలోని శాంతినగర్‌లో కమిషనర్ పర్యటించి, సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడారు. ఇంటింటి సర్వే చేపట్టి, తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని సూచించారు.

కొనసాగుతున్న డిజిటల్ కార్డు సర్వే

కంది(సంగారెడ్డి): మండలంలోని తోపుగొండలో డిజిటల్ సర్వే కొనసాగుతోంది. తోపుగొండను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓల ఆధ్వర్యంలో మూడు బృందాలుగా ఏర్పడి అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేస్తున్నట్లు తహసీల్దార్ విజయలక్ష్మి తెలిపారు. వివాహమైన ఆడపిల్లలు, చనిపోయిన సభ్యుల పేర్లను తొలగిస్తున్నారు. అలాగే, కొత్తగా పుట్టిన వారి పేర్లను నమోదు చేస్తున్నట్లు చెబుతున్నారు. పూర్తి వివరాలతో కుటుంబానికి ఒకటి చొప్పునా డిజిటల్ కార్డును అందజేయనున్నట్లు అధికారులు వివరిస్తున్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు రంగురంగుల పువ్వులతో బతుకమ్మలను తయారు చేసి,ఆడిపాడారు. ప్రిన్సిపాల్ రవీందర్ మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అలాగే, విద్యార్థులకు సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఎస్ఐ శశికాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. అనవసర లింక్‌లను ఓపెన్ చేయొద్దని సూచించారు.

గురువుల సేవలు వెలకట్టలేనివి

● ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి : నియోజకవర్గ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తా పీఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడిచిన ఎన్నికల్లో తనకు కొంత ఆరోగ్యం బాగోలేకున్న నిండు మనసుతో ఆశీర్వదించిన మీకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని అన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం రోజున ఉపాధ్యాయులను సత్కరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులను దేశం గర్వించేలా తీర్చిదిద్దాలని కోరారు. రాజకీయ నాయకుడిని మెచ్చుకునే వాళ్లు ఉంటారు..విమర్శించే వాళ్లూ ఉంటారు. కాని ఉపాధ్యాయుడిని విమర్శించే వారు ఉండరన్నారు.



ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే చింతాప్రభాకర్